పడకగది వంటగది

" She wouldn"t change her lot for any
artificial delights the world
could offer "

కరుబూజారావు మాంచి చదువుకున్న మనిషి. సంపన్నుడు. అన్నీ తెలిసిన వాడు, అతని భార్య శశికాంత ఉందే ఆమె బలే మాటకారి. సకలగుణ సంపెంగలా కీర్తి దిక్కు లల్లుకుపోయిన గుణవతి. బహూా మెళకువైంది.

అయినప్పటికిన్నీ వాళ్ళిద్దరియొక్క యభిరుచులు వేర్వేరు. ఒక్క పిల్లలకోసమై హృదయాలు ఏకంచేసుకుని ఏం ప్రవర్తిస్తారో, అది తప్పిస్తే తతిమ్మా యన్ని విషయాల్లోనూ ఎడ మొహం పెడమొహంగా వారిద్దఱూ యుండిపోవడం పరిపాటి.

"నేను క్లబ్బుకు వెళ్ళిపోతున్నానేవ్ ! వీధితలుపు వేసేసుకోవేవ్ !" అని కరుబూజారావు బుజాన్ని కండువా వేసుకొని, చేతి బెత్తంవంపు మోచేత తగుల్చుకుని, సెలవడిగితే శశికాంత " మళ్ళీ రేత్రి పంద్రెండు కొట్టాకే కమోసు కొంపకి?" అని ధడీలున తలుపువేసి గెడెట్టుకు లోపలకు చక్కాపోయింది. నిజంగా గడపంటూ ఉండబట్టిన్నీ, తలుపులకు గ్రందెలంటూ యుండబట్టిన్నీ, వాకిటి రెక్కలు తనమీద పడకుండా కరుబూజారావు ప్రాణాలు దక్కించు కవతల పడగలిగాడు— లోతట్టు ఒకడుగు ఉన్నా గాని మడమ నలిగి యతగాడి ప్రాణాలు కడట్టిపోను. శ్రీహరి ! ఏమిస్త్రీ ! ఆపె !

వెళ్ళిపోయింది తిన్నగా వంటిట్లోకి శశికాంత ధుమధుమ లాడుకుంటూ—" వీళ్ళ ఆటలు మండ ! పేకాటలు పడుగాటలూట!

వీళ్ళ సరదాలు తగలడ! రోజూ టాకీ గుడిసెల్లో దూరడమే, రోజూ మూకిగుడారాల్లో ప్రవేశించడమే. పై పెచ్చు పడగ్గది గోడలనిండా ఇవేం బొమ్మలో? సినీమా తారలంటూ యడ్డమైన ఆడవాళ్ళ ఫోటోలు పట్రాను! చట్రాల్లో బిగింపించను! మేకులు కొట్టను! తగిలించను—చచ్చిపోతున్నాను—ఓ శ్రీరాముని పటం లేదు. ఓ గౌరీదేవి విగ్రహం లేదు.—అవీ యక్కరలేదు. తెల్లగా ఉన్న గోడలు తెల్లగా ఉణ్ణిస్తే చక్కగా తెల్లారిపోను రోజులు! ఎంతడబ్బు వ్రయమైపోతూవుంది; ఎంతడబ్బు! ఎంతడబ్బు!" అని గుండెలు బాదుకుంది—స్వగతానికి లయేమో యన్నట్టు ఒకటి రెండు దఫాలు ఆ యిల్లాలు.

పెఱట్లో ఆకాశాన్ని యప్పుడే పొడుస్తూవున్న నక్షత్రాల్ని చూస్తూ ఆదాకా పొర్లి వచ్చిన దుఃఖం ఆపుకొన్నదై యంత లోనే ఓ చిన్ని చిరునవ్వు నవ్వుకుంది. "ఇవేళ ఓ పనిచేసి చూపిస్తాను" అని తీర్మానించుకుంది. తీర్మానించుకుందీ యంటే చేసేసిందన్నమాటే ఆవిడ ఏపనైనా.

వార్పులోను వడ్డనలోను చేయివేడెక్కకుండా యక్కర కుపకరిస్తాయని, అక్కడా ఇక్కడా కుక్కివుంచిన తనదాపుడు చిత్తు కాగితాలు, నోట్లలాగు దస్తావేజుల్లాగు ఓ లక్ష పైకి తీసింది. ఎక్కడివంటారు యవన్నీని? అవన్నీ బజార్లో చిల్లరగా మల్లరగా తెప్పించిన సరుకులకు యంగడివాండ్రు చుట్టీకట్టీ ఇచ్చిన పాత వార్తాపత్రికల కాగితపు తునుకలు, పావుటావులు, అరటావులు, అంతలేసివి.—అవన్నీ ముందుపడేసుకుని, అందులో బొమ్మలున్నవి, అక్షరాలున్నవి కొన్నికొన్ని ఏర్చింది ఓ వంద. చాలాభాగం యవన్నీ కాసరబీసర భాషల్లో ఉన్నవే—డెయిలీ

స్కెచ్, డెయిలీ రికార్డరు, పంచ్, స్పెక్టేటర్, ఇలాంటి వార్తా పత్రికలయొక్క శిష్టభాగాలు. ఓగిన్నెడు మైదాపిండి ఉడికించి, ఆ కాగితా లన్నింటికీ రాచి, పడగ్గదిలో భర్త తగిలించిన పటా లన్నింటిమీదనూ యంటించింది. వంట చేసింది. దీపం హెచ్చించి వెలుగులో కూర్చుని కత్తిరి పుచ్చుకుని, విడివిడిగా నట్టిం టెగురుతూయున్న మరోపాతవార్తాపత్రిక పుట యందుకుని యందులోని ఒక బొమ్మ యతి చిత్రంగా మహా చిత్రంగా ఆకారం చెడిపోకుండా చుట్టూ అంచునుబట్టి కత్తిరిస్తూ దానికేసి చూస్తు కాలం వెళ్ళబుచ్చుతూవుంది.

పన్రెండు కొట్టీకొట్టడంలో కరుబూజారావు ఇంటితలుపు తట్టాడు. శశికాంత లేచి మగనికి తలుపుతీసింది. భార్య తలుపు తీసితీయడంలోనే కరుబూజారావు తన కండువాను సావిట్లో కూర్చాన్ని తగిలించి, లాల్చీచేతులు పైకెగద్రోసికుంటూ "చూడౌనేవ్! ఆ రాయి ఇలాతే!" అంటూ తన జేబులోనుంచి తీగమేకున్నూ వోచిన్న పటమున్నూ తీశాడు. తీసి వెంటనే మేకొట్టి ఆ మేక్కు పటం తగిల్చి "నీళ్ళుపట్టుకురా కాళ్ళు కడుక్కోవడాని" కంటూ వెళ్ళి పెఱటో కాళ్లు కడుక్కుంటూ వున్నాడు.

ఆలోపున శశికాంత తాను కత్తిరించిపెట్టిన బొమ్మకు వెనుతట్టు మైదాపిండి రాచి యది తిన్నగా తీసుకువెళ్ళి భర్త కొత్తగా తగిలించిన పటాని కంటించింది; ఏమీ ఎఱగనట్టు వచ్చి భర్తకు అన్నం వడ్డించింది.

భర్త భోంచేసి, భార్య భోంచేసి, యిద్దఱూ శయనా గారం ప్రవేశించేసరికి రాత్రి రెండోఝాం దాటింది. ఇంగ్లీషు లెక్కప్రకారం కొత్తతేదీ వచ్చింది.

ప్రహస్వరాత్రి యంటూ ఒకేపక్కమీద భార్యాభర్త లిద్దరూ పవళించేరు. భర్త భార్యను తనకేసి తిప్పుకొంటూ "ఒసేవ్! ఇవాళ "చూడక చూచిన" అనే ఫిల్ములోని కథా నాయకిబొమ్మ కొనుక్కొచ్చి మనగోడక్కొట్టాను చూచావు?" అన్నాడు. భార్య చిరాగ్గా రెండోవంపుకు తిరిగి "మీరు చూపెడి తేగా చూచేది?" అంది. ఆ పాళంగా కరుబూజారావు వెంటనే లేచి వెళ్ళి తానావేళ కొనుక్కొచ్చినపటం గోడకు తగిలించింది తీసి, చేత్తోతుడిచి, ఆలా భార్యకు చూపించే తలంపుకంటె యంతకుముందు తానింకోసారి చూచే మురిసిపాటు హెచ్చై పడగ్గది పచ్చదీపబ్బుడ్డి ముందుపెట్టి పరకాయించేడు.

"నేనో బొమ్మట్టుకొస్తే ఇదోబొమ్మఅయిందేమిటేవ్! ఒసేవ్! ఇవాళదగా పడిపోయానేవ్! ఆరి వీడిల్లు వల్లకాడు గాను. "గొరిల్లా" పటమిచ్చాడేమిటే?" అని కేకేశాడు. "గొరిల్లా"వో "చింపంజీ"వో బాగాచూచారా?—ఏదైనా మీరు ఈదాకా కొనుక్కొచ్చిన బొమ్మలన్నింటికంటె బాగానేవుండి వుంటుంది. ఏది ఇలా పట్రాండి! చూసి చెప్తాను." అంది.

"ఇదిగో చూడు!" అని ఆ పటాన్ని పక్కమీద శశికాంత ముందుపడవేసి "ఏదో తిరకాసుజరిగింది" అంటూ చుట్టూ పడగ్గది నాలుగ్గోడలూ తిలకించేడు. భార్యచేసిన చేతకు లోపల మండిపోతూయున్నాడు. పైకి మాటాడలేకుండా వున్నాడు ఆలా మగడు చెకుముకిరాయిలాగవుంటె, శశికాంత పక్కమీదను అలాగే పండుకుండి, మోచేతి మోపున తలెత్తి భర్త పడవేసిన బొమ్మను తాను కొత్తగా చూస్తూవున్నదానిలా నటించి అంది: "దీనికేమండీ? ఇది నిక్షేపంలా ఉంది. సృష్టిలో పుట్టిపెరిగిన

జంతువు. కృత్రిమవేషం సుంతైనాలేనిది. ఎంచక్కా ముద్దొస్తూ వుంది. ఇవాళకు నాకు నచ్చినబొమ్మట్టుకొచ్చారండీ !" అని ఆ బొమ్మను ముద్దెట్టుకోబోయింది.

"ఇన్నాళ్ళు నాతో కాపరం వెలగబెట్టి తుదకు జంతు పటాన్నే ముద్దెట్టుకోవడం ! గొప్పఅభిరుచి వెల్లడించేవు ! తీసి పారెయ్యి ఆ బొమ్మను" అంటూ భార్యచేతిలోని దాన్ని తాను లాక్కొన్నాడు కరుబూజారావు.

చుట్టూ గోడలమీది పాత చిత్తుకాగితాలయొక్క అంటిం పులు వంకరటింకరలు యతగాణ్ణి మఱీ ఉగ్రుణ్ణిగావిస్తున్నాయి. "ఇంకా లాగిపారెయ్యవేం ఆ అంటించిన కాగితాలు ? లాగి పారేస్తావా లేదా ?" అన్నాడు. "నేలాగిపారెయ్యను. అవన్నీ నా పటాలు. ఇదీ నాపటమే !" అంది శశికాంత మంచంమీద నుంచి దిగి నిటాగ్గా నిలబడి మగనిచేతిలో వున్న క్రొంగ్రొత్త చిత్తరువు తాను లాగిపుచ్చుకుంటూ మళ్ళీమళ్ళీ ఆ పటాన్నే చూస్తూ "నయం! ముద్దెట్టుకున్నాను కాను. ఇది ఎవరిదో పర పురుషుడిపటంలాగున్నదండీ ! ఛీ !" అని అక్కడే నేలమీదను కాళ్ళుతుడుచుకొనే గోజురీవుంటే దానిమీదకు విసిరేసింది. కరుబూజారావు ఆ విసురమ్మటే తన తలవంచి ఆ బొమ్మను చూస్తూ "ఇది మగాడే అయితే ఉరాంగు-ఉటాంగులా గున్నాడు ! వెధవ !" అన్నాడు.

"వెధవో గిధవో ! నాకదంతా తెలీదు. నేను ఓ చిత్తు కాగితంలోంచి కత్తిరించి మైదాపిండి రాసి మీరట్టుకొచ్చిన బొమ్మమీద ఉడుకుమోత్తనం కొద్దీ యంటించాను. మీరు సొర కాయ కోతలు కోస్తూ మురిసిపొయ్యే ఆడవాళ్ళ బొమ్మలు

మాత్రం? అవీ అచ్చుగుద్దిన బాపతులే కదండీ? అవి కూడా మనం చూస్తే—పణ్యో, కన్యో. పునిస్త్రీవో, పూర్వ సువాసినీవో తెలిసేది లేనేలేదు కదండీ? అంతకంటె మెరుగే కదండీ ఇది? నరుని దైతేం? వానరునిదైతేం? హృదయం కలిగిన బొమ్మ యిది! కనిపెట్టేరో లేదో మీరు. ఈ వొక్క భౌతికంలో యగ పడ్డంలే? కేవలం ప్రకృతిని ప్రేమిస్తూవున్న అకృత్రిమపుటాత్మ! జంతువే కానీండి. జానపదమే కానీండి?" అంది శశికాంత ఉప్పొంగిపోయి.

కరుబూజారావు ఆలోచనలో పడ్డాడు. "పదా? నీవు ఏ చిత్తు కాగితంలోంచి ఈబొమ్మను చించి తీశావో చూపించు" అన్నాడు, దుమ్ములోపడ్డ బొమ్మను పైకెత్తి దులుపుతూ, మెల్లగా గోడకు తగిలించి.

శశికాంత వంటగదిలోకి వెళ్ళి తాను దేనినుంచి ఆబొమ్మ కత్తిరించిందో ఆ కాగితం కోసం వెదుకుతూవుంది. మరోదీపం వెలిగించి—చమక్ చమక్‌గా.

ఆమె వెనకాతలే కరుబూజారావు వంటయింటిలోనికి వెడుతూ "నిజంగా! ఏ బొమ్మా, ఏ సొమ్మూ, లేని యీ వంట గదియే ఎక్కువ ప్రశాంతంగా వుంది! అయితే నీవు ఈ చిత్తు కాగితాలన్నీ కూడిగ్గా దాస్తూవున్నావు? ఎంత పొదుపు నీది!" అని శశికాంత యొక్క రైక లేక పైట జారిన వీపుమీదను ముద్దుముద్దుగా తట్టాడు.

ఇంకా ఏమైనా చనువు చేష్టలు చేసే వాడేమో!—అంతలో పొరుగింటి ముసలమ్మ చల్లకవ్వం త్రిప్పుతూ, పెరుగు తరుస్తూ, చిన్న కిట్టమ్మమీది పాటలు వినసొంపుగా పాడి లోకంతోపాటు

ఆ భార్యాభర్త లిద్దరికీ కూడా తెలివి గొలిపింది. చిత్తుకాగితం ఎక్కడనుంచి ఎక్కడకు పోయిందీ తెలుపుడు చేసింది.

ఆ కాయితం ముక్క, బొమ్మ కత్తిరింపబడ్డ భాగం గ్రహణం మొట్టిలా ఆనవాలుగా అగపిస్తూవుంటే వీథంట ఎగిరి పోతూవుంది. ఆ ఎగిరిపోతూయున్న దాన్ని కరుబూజారావు వెనుదగిలి తీసికొనివచ్చి సూర్యరశ్మిలో చూచేడు.

29-4-1939 తేదీ గల డెయిలీ మిర్రర్‌యొక్క 18-వ పుటనుండి కత్తిరింపు అది. ఆ బొమ్మ డెబ్బైభ ఆరేండ్ల కన్య! ఆమెయొక్క జీవితాన్ని గుదించిన వాక్యాలు అతి శ్రద్ధగా చదివినవారై బొమ్మను మళ్ళీ మళ్ళీ చూచినవారై కరుబూజా రావూ శశికాంతా యిద్దరూకూడా అన్యోన్యం యిలా చెప్పు కున్నారు మనకూ మనకూ తెలియని ఇంగ్లీషుభాషలో అతి రహస్యంగా కొసకు దేలిన ముక్కగా ఆ బొమ్మని గురించి— ఏమనీ?

'She wouldn't change her lot for any artificial delights the world could offer' అని.

....

నిన్నటిపువ్వు నిన్నటిదైనిక

నాడు మదరాసుకు మెయిల్లో టిక్కట్టు దురుకుతుందా లేదా అనే ఆందోళనతో రాజమహేంద్రం స్టేషన్‌కు వెళ్ళాను. టిక్కట్టు చులాగ్గానే దొరికింది. "బుక్కింగు ఆపేశాం" అని గాని "చిల్లరలే"దని గాని అనకుండా గూడిలోంచి యివలకు